క్లుప్తంగా

31లోగా పన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీ

• మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్



పార్వతీపురం టౌన్: మార్చి 31వ తేదీ లోపు పన్ను పూర్తిగా చెల్లిస్తే వడ్డీ రాయితీ కల్పిస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను ఈ నెల 31లోగా చెల్లిస్తే వడ్డీ మాఫీ చేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలన్నారు. వార్డు సచివాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో పన్ను చెల్లించవచ్చని తెలిపారు. సెలవు రోజుల్లో కూడా పన్ను స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. సీడీఎంఏ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా పన్ను చెల్లించవచ్చని తెలిపారు.

ఘనంగా వినాయక ఆలయ ప్రారంభోత్సవం



హోమం చేస్తున్న వేదపండితులు ప్రదీప్‌శర్మ, కిరణ్‌కుమార్ శర్మ

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట స్వామి దయానంద సేవ ఆశ్రమంలో వరసిద్ధి వినాయక ఆలయాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఎయిమ్ ఫర్ సేవ ఛాత్రాలయ మేనేజర్ ఎస్.సురేష్ ఆధ్వర్యంలో వేద పండితులు ముక్కపల్లి ప్రదీప్‌శర్మ, కిరణ్‌కుమార్ శర్మ మంత్రోచ్చారణల నడుమ కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, యాగాలు చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శంబంగి వేణుగోపాలనాయుడు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల కోడ్.



పలగరలో సూచనలు ఇస్తున్న నోడల్ అధికారి రమేష్‌నాయుడు

బలిజిపేట: గ్రామాల్లో ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని నోడల్ అధికారి రమేష్‌నాయుడు తెలిపారు. పలగర గ్రామంలో ఎన్నికల కోడ్ అమలు తీరును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడా బ్యానర్లు, పార్టీ జెండాలు ఉండరాదన్నారు. ఇళ్లపై జెండాలు పెట్టుకోవడానికి అనుమతులు అవసరమని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించేవారిపై చర్యలు తప్పవన్నారు. అనుమతుల్లేకుండా సమావేశాలు ఏర్పాటు చేయరాదని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సాలూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఏపీఎన్‌జీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ ప్రసన్నకుమార్, జానకి అన్నారు. పట్టణంలోని నవజీవన్ ఆశ్రమంలో శనివారం ప్రపంచ వాతావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రాత్రి 8.30 నుంచి 9.30 వరకు విద్యుత్ ఉపకరణాల వినియోగాన్ని నిలిపివేశారు. గ్లోబల్ వార్మింగ్, పర్యావరణ పరిరక్షణ, తదితర అంశాలపై విద్యార్థులు, ప్రజలు అవగాహన కల్పించారు. అనంతరం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

సాలూరు: భారత స్వాతంత్య్ర సమరయోధుడు భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని కొంకి వీధి లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మండపంలో 'మీకై మేము' వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ వాసునాయుడుతో పాటు 25 మంది రక్తదానం చేశారు. రక్తదానం ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. అంతకుముందు స్థానిక రాజేశ్వరి పార్క్‌లో ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ బంకురు అప్పలనాయుడు, డాక్టర్ దాక్షాయణి, డా.పెంట శ్రీనివాసరావు, డా.ఇందుమణి మాతాజీ, సంస్థ అధ్యక్షుడు ఇప్పిలి దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

స్థానిక రాజేశ్వరి పార్క్‌లోని భగత్ సింగ్ విగ్రహానికి సీఐటీయూ నాయకులు ఎన్.వై.నాయుడు, శ్రీనివాసరావు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్య్ర పోరాటంతో భగత్ సింగ్ పోరాటాలను గుర్తుచేసుకున్నారు.

ప్రజలకు మంచి చేయడమే
వైఎస్సార్‌సీపీ అజెండా

- అధికారం కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ ఒక్కటయ్యాయి
- చంద్రబాబు గతంలో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదు
- ఇచ్చిన హామీలు నెరవేర్చిన వారికే ఓటు వేయండి
- శివరాంపురంలో డిప్యూటీ సీఎం రాజన్నదొర ఎన్నికల ప్రచారం



డిప్యూటీ సీఎం రాజన్నదొరకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

సాలూరు రూరల్: ప్రజలకు మంచి చేయడమే వైఎస్సార్‌సీపీ అజెండా అని, గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేశామని, ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీలు అధికారం కోసమే ఒక్కటయ్యాయని, ప్రజలకు మేలుచేయాలని కాదని అన్నారు. మండలంలోని శివరాంపురం నుంచి శనివారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా గ్రామంలోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మీకు మేలు జరిగితే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని అడిగే దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ప్రజలకు ఏం చేశారో చెప్పి ఓట్లు అడగాలని సవాల్ విసిరారు. 2014 ఎన్నికల సమయంలో రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణాల మాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక రుణమాఫీ చేయకుండా రైతులు, మహిళలను చంద్రబాబు మోసం చేశారని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలతో రాష్ట్రం ఒక వెనుజుల, శ్రీలంక మాదిరిగా ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతాయని విమర్శించిన చంద్రబాబు.. ఇప్పుడు ఎన్నికల కోసం అవే ఉచిత హామీలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవాచేశారు. టీడీపీ నాయకుల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని అన్నారు. రాజన్నదొరకు గ్రామస్తులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. జై జగన్, జై రాజన్న దొర నినాదాలు చేశారు.



కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్న దొర



రాజన్నదొరను దీవిస్తున్న మహిళ

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..

శివరాంపురం గ్రామానికి గుమడాం నుంచి బీటీ రోడ్డు వేయించానని, వేగావతి నదిపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.6 కోట్లు నిధులు మంజూరు చేసేలా కృషిచేశానని అన్నారు. అలాగే సాలూరు బైపాస్ రోడ్డు నిర్మాణం, కొట్టక్కి బ్రిడ్జి మరమ్మతులకు రూ.20 కోట్లు నిధులు మంజూరు చేయించానని అన్నారు. సాలూరులో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం చేపడుతున్నామని, ఏజెన్సీలో బీటీరోడ్లు, బ్రిడ్జిలు తన హయాంలోనే జరిగాయన్నారు. గతంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని అన్నారు. టీడీపీ నాయకులు తనపై ఆరోపణలు చేసేముందు ఆలోచించాలని సూచించారు. వారికి ధైర్యం ఉంటే అభివృద్ధిపై తనతో చర్చకు రావాలని సావాల్ విసిరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సాలూరు నియోజకవర్గంలో రూ.1,600 కోట్లతో సంక్షేమ ఫలాలు అందించామని, రూ.1,200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. జగనన్న ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. ప్రజలు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు మావుడి రంగునాయుడు, జరజాపు ఈశ్వరరావు, వైస్ చైర్‌పర్సన్ జరజాపు దీప్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ, పార్టీ జిల్లా కన్వీనర్ దండి శ్రీను, పాచిపెంట మండల నాయకుడు డోల బాబ్జి, శివరాంపురం సర్పంచ్ జరజాపు మోహన్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం

- చంద్రబాబు ఇక ఇంటికే పరిమితం
- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్వతీపురంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు, తదితరులు

పార్వతీపురం టౌన్: సంక్షేమ పాలన అందించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గెలుపు ఖాయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. 2014లో గెలుపొంది.. రాక్షస పాలన అందించిన చంద్రబాబును ప్రజలు తమ ఓటుతో ఇంటికే పరిమితం చేస్తారని చెప్పారు. పట్టణంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అలజంగి, తదితరులు ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో రైతు రుణమాఫీ ఉందని, అయితే రైతులకు ఒక్క రూపాయి కూడా మాఫీ చేయకుండా మోసం చేశాడని ఆరోపించారు. అందుకే 2019 ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. చంద్రబాబు వ్యవసాయం దండగ అంటే.. దాన్ని పండగలా మార్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నదాతను అన్ని విధాలుగా ఆదుకుని, వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారని కొనియాడారు. అకాల వర్షాలకు తడిచిన ధాన్యం సైతం కొనుగోలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. తుఫాన్‌ల సమయంలో పంటలు కోల్పోయిన రైతులకు ఆర్థికంగా అండగా నిలిచామని తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలను ఓట్లడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉంది

- జగనన్నను మళ్లీ సీఎంను చేసేందుకు ప్రజలంతా సిద్ధం
- ఎవరెన్ని పొత్తులు పెట్టుకున్నా వైఎస్సార్‌సీపీదే విజయం
- డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర



సాలూరు: ప్రజలను ఓట్లు అడిగే హక్కు రాష్ట్రంలో ఒక్క వైఎస్సార్‌సీపీకే ఉందని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందించారన్నారు. పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ పథకాలు అందించామన్నారు. మీకు మంచి జరిగిందని అనిపిస్తే రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని ధైర్యంగా అడిగే ఏకైక నాయకుడు వైఎస్ జగన్ అని అన్నారు. ప్రజాక్షేత్రంలో ఒక్కసారి కూడా గెలవని మాజీ ఎమ్మెల్సీ సంధ్యారాణి, మాజీ మంత్రి నారా లోకేష్ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన నన్ను కోర్టు ద్వారా ఎమ్మెల్యే అయ్యానంటూ విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నియోజకవర్గంలో కోట్లాది రుపాయలతో సంక్షేమ పథకాలు, వంతెనలు, రోడ్లు, కల్వర్టులు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు.

ఎన్ని పొత్తులతో వచ్చినా వైఎస్సార్‌సీపీదే విజయం

నాడు కూటమితో కలిసి 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజలకు ఏం మేలు చేయలేదని, నేడు అదే కూటమితో.. అసత్య ప్రచారాలతో మళ్లీ ప్రజల్లోకి వస్తున్నారని ఎద్దేవాచేశారు. ప్రజాశీర్వాదం ఉన్న జగన్‌ను ఓడించడానికి మూడు పార్టీలు ఏకమయ్యాయని, కూటమిని కుయుక్తలను తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గతంలో ఒకరిపై ఒకరు ఎన్నో విమర్శలు చేసుకుని నేడు అధికారం కోసం పొత్తులు పెట్టుకోవడం వారి రాజకీయ దిగజారుడుతనానికి అద్దం పడుతోందన్నారు. ఎన్ని పొత్తులతో వచ్చినా ప్రజలు వారిని నమ్మే స్థితిలో లేరన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతీ హామీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని, కోవిడ్ కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. జగనన్న మరోసారి ముఖ్యమంత్రి అయితే ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సీతానగరం: మండలంలోని పెదబోగిలి, సీతానగరం గ్రామాల్లో హెవీ పవర్‌లైన్, ఎల్టీ లైన్‌లకు నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఆదివారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏఈ జగన్ మోహనరావు తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ, పనులు పూర్తయిన తర్వాత సరఫరా పునరుద్ధరిస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జ్వరాలు ప్రబలకుండా చర్యలు

• డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి బి. జగన్నాథరావు

పార్వతీపురం టౌన్: జిల్లాలో జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి బి. జగన్నాథరావు అన్నారు. ఈ మేరకు స్థానిక ఎన్‌జీఓ భవనంలో ఆరోగ్య పర్యవేక్షకులు, సహాయకులకు కీటక జనిత వ్యాధుల నియంత్రణపై నిర్వహిస్తున్న రీ ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణలో పొందిన పరిజ్ఞానంతో క్షేత్ర స్థాయిలో దోమల వ్యాప్తిని నియంత్రించాలన్నారు. మలేరియా, డెంగీ లక్షణాలతో ఉన్న వారిని గుర్తించి, వెంటనే నిర్ధారణ పరీక్షలు చేపట్టాలని సూచించారు. డ్రై డే పక్కాగా నిర్వహించేలా ప్రజలను చైతన్య పరచాలన్నారు. జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు మాట్లాడుతూ.. రెండు రోజుల శిక్షణలో దోమల నియంత్రణ చర్యల పద్ధతులు, స్ప్రేయింగ్ పద్ధతులు, కీటక సంహారిణి రసాయనాలు వినియోగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో వైద్యులు రఘుకుమార్, శ్రీధర్, ఏఎంఓ సూర్యనారాయణ, జిల్లా వీబీడీ కన్సల్టెంట్ రామ చంద్రరావు, ఈఓ నాగేంద్ర, సబ్ యూనిట్ అధికారులు, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలే ధ్యేయం..

• ఆర్డీఓ హేమలత



పార్వతీపురం టౌన్: ప్రశాంత ఎన్నికల నిర్వహణే తమ ధ్యేయమని.. ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పార్వతీపురం ఆర్డీఓ హేమలత తెలిపారు. ఫ్లెక్సీల ఏర్పాటు.. ర్యాలీలు, సభలు, సమావేశాలకు అభ్యర్థులు సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో గాని, నేరుగా గాని దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ మేరకు ఆమె శనివారం సాక్షితో మాట్లాడారు.

సాక్షి: సిబ్బందిని ఏ విధంగా అప్రమత్తం చేశారు?

ఆర్డీఓ: రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఓలు, ఎన్నికల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నాం. ఎన్నికలకు సంబంధించి పార్వతీపురం కార్యాలయంలో సమాచార కేంద్రం (శ్రీనివాసరావు, సెల్: 79890 39866) ఏర్పాటు చేశాం. పోలీస్, ఆర్‌అండ్‌బీ, ఎలక్ట్రికల్, ఫైర్ విభాగాలకు చెందిన అధికారులు మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎలక్షన్ సెల్ విభాగంలో అందుబాటులో ఉంటారు.

సాక్షి: అభ్యర్థులు ఎప్పుడు దరఖాస్తు చేసుకోవాలి?

ఆర్డీఓ: ప్రచారానికి 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 18న ఎలక్షన్ నోటిఫికేషన్ వస్తుంది. అప్పటి నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. అభ్యర్థుల ప్రచార ఖర్చులు 18 ముందు అయితే ఆయా పార్టీల ఖాతాల్లోను.. 18 తర్వాత అయితే అభ్యర్థుల ఖాతాల్లో ఎన్నికల ఖర్చుగా నమోదు చేస్తాం.

సాక్షి: సమస్యాత్మక గ్రామాలను గుర్తించారా?

ఆర్డీఓ: నియోజకవర్గంలో మూడు మండలాలు, ఒక మున్సిపాలిటీలో 23 సమస్యాత్మక ప్రాంతాలను పోలీస్ ఉన్నతాధికారులు గుర్తించారు. ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్‌లను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. వాటినే ఈవీఎల స్ట్రాంగ్ రూమ్‌గా కూడా ఉపయోగిస్తాం. నియోజకవర్గంలో మొత్తం 37 రూట్ అధికారులను నియమించాం.

సాక్షి: హోమ్ ఓటింగ్ అంటే ఏమిటి ?

ఆర్డీఓ: ఈ ఏడాది నుంచి హోమ్ ఓటింగ్ విధానం అమల్లోకి వచ్చింది. 85 ఏళ్ల దాటి మంచానికే పరిమితమైన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. వీరు 12డి– ఫారం దగ్గర్లో ఉన్న బూత్ లెవిల్ ఆఫీసర్‌కు అందజేయాలి. అటువంటి వారింటికి బ్యాలెట్ పత్రం, బాక్సు, పోలీసు ఎస్కార్ట్‌తో వారి ఇంటికి పంపిస్తాం.

సాక్షి: ఏఓబీ సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారా?

ఆర్డీఓ: నియోజకవర్గంలో రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. పార్వతీపురం మండలం అడారు, ఆర్‌కే బట్టివలస చెక్‌పోస్టుల్లో తనిఖీ ముమ్మరం చేశాం. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఆంధ్రా – ఒడిశా సరిహద్దులో భద్రత పటిష్టపరిచాం. ఒడిశా నుంచి గంజాయి, సారా, మాదకద్రవ్యాలు రాకుండా నిఘా పెట్టాం.

సాక్షి: నియోజకవర్గంలో పోలింగ్ ఏర్పాట్లు ఎలా చేసారు?

ఆర్డీఓ: నియోజకవర్గంలో మొత్తం 233 పోలింగ్ కేంద్రాలున్నాయి. మూడు మండలాలకు ముగ్గురు ఏఆర్‌ఓలను నియమించాం. 33 సెక్టార్ అధికారులు, 37 రూట్ అధికారులు, 10 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించాం. ప్రిసైడింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బందితో సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నాం. అభ్యర్థుల ఎన్నికల ఖర్చు లెక్కించేందుకు అవసరమైన సిబ్బందిని సిద్ధం చేశాం. ఎంసీసీ నిబంధనలు ఉల్లంఘనపై ఆర్డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ (08963229228) ఏర్పాటు చేశాం.

ఈవీఎంలపై అవగాహన తప్పనిసరి

• తహసీల్దార్లు అడబాల శ్రీనివాసరావు, జీవీ రమణ



ఈవీఎం వినియోగంపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్లు శ్రీనివాసరావు, జనార్దన్

సీతానగరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు ఈవీఎంల పనితీరుపై అవగాహన కలిగి ఉండాలని సీతానగరం, బలిజిపేట తహసీల్దార్లు అడబాల శ్రీనివాసరావు, జీవీ రమణ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ అధికారి (ఆర్డీఓ)కె. హేమలత సూచనల మేరకు మండల పరిషత్ ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అధ్యక్షతన పీఓ, ఏపీఓలకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈవీఎంల పనితీరును నిశితంగా పరిశీలించాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ల స్వీకరణ, ఓట్లు లెక్కింపులపై తగు సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు జి. సూరిదేముడు, ఎంవీ రమణ, సామల సింహాచలం, రెండు మండలాల పోలింగ్ కేంద్రాల పరిశీలకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకే ప్రజా మద్దతు

• ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మద్దతు తెలుపుతున్న నియోజకవర్గ ప్రజలు



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ప్రజలు

పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్యే అలజంగి జోగారావుకి రెండోసారి టికెట్ ప్రకటించిన నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పలు మండలాల నుంచి ప్రజలు శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వచ్చి అలజంగికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో మూడు మండలాలు, పురపాలక సంఘం నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ నిజమైన హీరో

పార్వతీపురం టౌన్: భగత్‌సింగ్ నిజమైన హీరో అని ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు అన్నారు. ఎస్ఎఫ్ఐ పార్వతీపురం కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక భాస్కర్ డిగ్రీ కళాశాలలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశ సంపదను దోచుకుపోతున్న బ్రిటిష్ పాలకులను ఎదురించి, చిన్న వయసులోనే ప్రాణాలు అర్పించిన ధీరులని కొనియాడారు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని అంతమొందించాలనే భగత్‌సింగ్ పిలుపు ప్రమాదకరమని భావించిన బ్రిటిష్ పాలకులు కోర్టు విధించిన శిక్షకు ఒకరోజు ముందునే చీకటి గదిలో ఉరి శిక్షకు పాల్పడ్డారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అఖిల్, జిల్లా కమిటీ సభ్యులు పి.రాజశేఖర్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విప్లవకారునికి నీరాజనాలు..

బలిజిపేట: పెదపెంకి నేతాజీ గ్రంథాలయం వద్ద భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు, తదితరులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భగత్‌సింగ్ ఇచ్చిన ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదం దేవ నలుమూలలా వ్యాపించి యువతను ఉత్తేజపరిచిందన్నారు. కార్యక్రమంలో కె.మురళి, బి.శ్రీను, కె.గౌరీనాథ్, వి.శివుడునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో కాశీపట్నం

- పంచాయతీ పరిధిలో రూ.2.60 కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాల ద్వారా 7499 మందికి రూ.21.37 కోట్లు అందజేత

మక్కువ: మండలంలోని కాశీపట్నం పంచాయతీ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. గత టీడీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన ఈ గ్రామంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రూ.2.60 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. పంచాయతీ పరిధిలో అర్హులైన 7499 మందికి సంక్షేమ పథకాల ద్వారా రూ.21,37,24,006లు అందజేశారు. గతంలో ఎన్నడూ జరగనంత అభివృద్ధి ఈ ఐదేళ్లలో జరిగిందని పంచాయతీ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయం పరిధిలో చేపట్టిన అభివృద్ధి

- రూ.42 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.48 లక్షలతో కేజీబీవీ పాఠశాల నిర్మాణం చేపడుతున్నారు.
- రూ.21.80 లక్షలతో రైతుభరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలు నిర్మించారు.
- అలాగే రూ.40 లక్షలతో ఏఎంసీ భవనం, రూ.15 లక్షలతో పాల సేకరణ కేంద్రం నిర్మిస్తున్నారు.
- గ్రామంలో 13.50 లక్షలతో సీసీరోడ్లు, కాలువలు, గ్రావెల్‌రోడ్డు నిర్మించారు.
- మేలాపువలస గ్రామంలో రూ.13.50 లక్షలతో అంగన్‌వాడీ భవనం నిర్మించారు.
- గడపగడపకు మన ప్రభుత్వం, జెడ్పీ నిధులు రూ.4 లక్షలతో కాలువలు, రూ.23 లక్షలతో రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేసి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నారు.
- పాపయ్యవలసలో రూ.5 లక్షలతో సీసీరోడ్లు, కాలువలు నిర్మించారు.
- కొండరేజేరు గ్రామంలో రూ.3.30 లక్షలతో కాలువలు, సీసీరోడ్డు నిర్మించారు.
- ములక్కాయవలసలో రూ.14.50 లక్షలతో సీసీ రోడ్లు, కాలువలు ఏర్పాటుచేయడం జరిగింది.
- కాశీపట్నం పంచాయతీ పరిధి 1,425 గృహాలు ఉండగా అందులో అర్హత ఉన్న 1,360 కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా రూ.21,37,24,006లు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగింది. ఇది కాక నాన్ డీబీటీ విధానంలో కోట్లాది రూపాయల లబ్ధి పొందారు.



వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనం



గ్రామ సచివాలయం



ఆర్‌బీకే భవనం



సీసీ రోడ్డు



రక్షిత మంచినీటి పథకం